క్లుప్తంగా

విద్యుత్ సమస్యలు వెంటనే పరిష్కరించాలి



సమస్యలు తెలుసుకుంటున్న ఎస్ఈ కరుణాకర్

హుడాకాంప్లెక్స్: విద్యుత్ వినియోగదారుల సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి వెంటనే పరిష్కరించాలని టీఎస్ఎస్పీడీసీఎల్ సరూర్‌నగర్ ఎస్ఈ కరుణాకర్‌బాబు అన్నారు. శనివారం డీఈ రామకృష్ణ, ఏడీఈ తిరుపతయ్య, ఏఈలు అనూషా, రాణా రోహిత్ రాజాలతో కలిసి చెరుకుతోట కాలనీ, బాబునగర్, ఎంసీహెచ్ కాలనీలో పర్యటించారు. రోడ్డుకు అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభాలు, ఇండ్లకు దగ్గరగా ఉన్న లైట్లు, ట్రాన్స్‌ఫార్మర్లను దూరంగా తొలగించాలని ఆయా కాలనీల ప్రజలు విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. వీటిపై స్పందించిన ఎస్ఈ త్వరగా సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

అయ్యప్ప స్వాములకు పండ్ల పంపిణీ



అయ్యప్ప స్వాములకు పండ్లు పంపిణీ చేస్తున్న ఆసిఫ్‌జానీ

కందుకూరు: అయ్యప్ప స్వాములకు ముస్లిం సోదరులు పండ్లు పంపిణీ చేసి మతసామరస్యాన్ని చాటుకున్నారు. శనివారం మండల పరిధిలోని మహ్మద్‌నగర్‌కు చెందిన ఎండీ ఆసిఫ్‌జానీ తన స్నేహితుడు ఖాదర్ ద్వారా కొత్తగూడలోని అయ్యప్పస్వాములకు పండ్లు పంపిణీ చేశారు. సర్పంచ్ సాధ మల్లారెడ్డి, స్వాములు శేఖర్, సురేందర్, ప్రవీణ్ పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

ఎల్‌బీనగర్ : ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకుని వైద్యపరీక్షలు చేయించుకుని సంపూర్ణ ఆరోగ్యంగా జీవించాలని లింగోజిగూడ డివిజన్ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. శనివారం డివిజన్ పరిధిలోని కాకతీయనగర్‌లోని కాకతీయస్కూల్‌లో ఏర్పాటు చేసిన ఉచితవైద్య శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వైద్యపరీక్షలకు కాలనీ ప్రజలు పెద్దఎత్తున పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. స్కూల్ విద్యార్థులకు కంటిపరీక్షలు, డెంటల్ పరీక్షలు చేశారు. మాజీ కార్పొరేటర్ ముద్రబోయిన శ్రీనివాసరావు, మల్లారపు శాలిని, స్కూల్ డైరెక్టర్ ఉమారెడ్డి, ప్రిన్సిపాల్ సుచరితరెడ్డి తదితరులున్నారు.

కేలండర్ ఆవిష్కరణ

ఎల్‌బీనగర్ : బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని ఎన్‌జీఓకాలనీ రంగస్థలం కళాకారుల ప్రాంగణం వనస్థలిపురం భక్తసమాజం ఆధ్వర్యంలో 2024 తెలుగు సంవత్సర కేలండర్‌ను కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి ఆవిష్కరించారు. శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో వనస్థలిపురం భక్త సమాజం అధ్యక్షులు సీహెచ్. ఆర్‌కే మూర్తి, ఎన్‌జీఓ కాలనీ అధ్యక్షుడు పంపన వెంకటేశ్వర్లు, ఫిలిం సెన్సార్‌బోర్డు మెంబర్ కృష్ణాదిశేషు, గోరక్షక్ యాదగిరిరావు, జాగృతి అభ్యుదయ సంఘం అధ్యక్షుడు భావన శ్రీనివాస్, జడ్జి కృష్ణమూర్తి, నారాయణరావు, జైపాల్‌రెడ్డి, సత్యనారాయణ, వర్ధని, నర్సింహారెడ్డి, రమేశ్, మనోహర్ తదితరులున్నారు.

లోక్ అదాలత్‌తో కేసుల పరిష్కారం

హయత్‌నగర్: కేసుల పరిష్కారానికి దీర్ఘకాలంగా కోర్టుల చుట్టూ తిరగకుండా లోక్ అదాలత్‌లో పరిష్కరించుకునేందుకు ముందుకు రావాలని దీనికి కోర్టు తగిన అవకాశాలను కలిస్తుందని హయత్‌నగర్‌లోని 14వ మెట్రోపాలిటన్ కోర్టు జడ్జి సల్మా ఫాతీమా అన్నారు. శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో 3570 కేసులను పరిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... కోర్టులలో కేసులు పేరుకుపోకుండా రాజీకి అర్హత ఉన్న కేసులను పరిష్కరించేందుకు లోక్ అదాలత్‌లను నిర్వహిస్తున్నామన్నారు. అదనపు జడ్జి సంకేత్ మిత్ర, రిటైర్డ్ జడ్జి రవికుమార్, ఏపీపీ అరుణోదయకుమార్ తదితరులున్నారు.

అనుమతి తప్పనిసరి

సీఐ శివప్రసాద్

కడ్తాల్: న్యూ ఇయర్ వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలని సీఐ శివప్రసాద్ సూచించారు. శనివారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐ మాట్లాడుతూ కొత్త ఏడాది సందర్భంగా ఎవరైనా వేడుకలు నిర్వహించుకోవాలనుకుంటే, ముందుగా సంబంధిత అధికారులతో పాటు, పోలీస్‌శాఖ నుంచి అనుమతి తీసుకోవాలని తెలిపారు. అన్ని దుకాణాలు, షాపులు, బార్లు, రెస్టారెంట్లు, వైన్స్ షాపులు రాత్రి ఒంటి గంటకు బంద్ చేయాలని సూచించారు. నియమాలను ఉల్లఘించిన వారిపై చట్టపరమైన తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నూనె గింజల సాగు.. భలే బాగు



ముద్దెంగూడలో సాగు చేసిన తెల్లకుసుమ పంట

- రైతులకు అధిక దిగుబడులు
- తెల్ల కుసుమ పంటలపై ఆసక్తి
- గతం కంటే పెరిగిన విస్తీర్ణం

షాబాద్: నూనె గింజల సాగుతో రైతులకు దిగుబడులు పెరుగుతున్నాయి. మార్కెట్‌లో నూనె ధరలు పెరుగుతుండడంతో రైతులు తెల్ల కుసుమ పంటను సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. జిల్లాలో ఎక్కువ మంది తెల్ల కుసుమ, నల్ల కుసుమ పంటలను వేస్తున్నారు. ఈ నూనెతో ఆరోగ్యానికి మేలు కలుగుతుందని వారు అధికాంగా వేస్తున్నారు. ఈ క్రమంలో తెల్ల కుసుమ సాగు విస్తీర్ణం గతం కంటే పెరిగింది. దీంతో రబీలో వీటిని సాగు చేయడానికి రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. తెల్ల కుసుమ ఉత్పత్తి తగ్గిపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో వినియోగదారులు మార్కెట్లో లభించే ఏదో ఒక బ్రాండ్ నూనెను వాడుకోవాల్సి వస్తుంది.

సాగుకు ప్రోత్సాహం కరువు

రబీలో పండించే నూనెగింజల్లో ప్రధాన పంట తెల్ల కుసుమ. దశాబ్దం క్రితం రైతులు వేల ఎకరాల్లో తెల్ల కుసుమ పంట వేసేవారు. ఏ ఇంట చూసినా తెల్ల కుసుమలను గానుగాడించి ఏడాదిపాటు అవసరమైన వంటనూనె నిల్వ చేసుకునే వారు. తెల్లకుసుమ పంట సాగు తరిగిపోవడంతో పరిస్థితిలో మార్పులు చోటుచేసుకున్నాయి. రబీలో నల్లరేగడి నేలల్లో పూర్తిగా లేదా అంతర పంటగా తెల్ల కుసుమ సాగు చేసేవారు. తెల్ల కుసుమను తెల్లజొన్న, శనగ పంటలో అంతర పంటగా సాగు చేసేవారు. మండలంలో పత్తిసాగు పెరగడంతో తెల్ల కుసుమకు శాపంగా మారింది. పత్తి పంటను ఖరీఫ్‌లో సాగు చేసినప్పటికీ రబీ పంట కాలం ముగిసే వరకు దిగుబడులు ఇస్తుంది. దీంతో రబీసాగుకు అవరోధం ఏర్పడుతుంది. పత్తి సాగుతో ముఖ్యంగా మండల ప్రజల ఆహార పంటైన తెల్లజొన్న, శనగ సాగును తీవ్రంగా దెబ్బతీసింది. అదే సమయంలో జొన్న, శనగలో అంతర పంటగా సాగు చేసే కుసుమ పంట సాగును ప్రభావితం చేసింది. దశాబ్దం క్రితం వరకు వేల ఎకరాల్లో సాగు చేసే తెల్ల కుసుమ పంట వందల్లోకి పడిపోయింది. ప్రస్తుతం మండలంలో సుమారు 2,584 నుంచి 38,521 ఎకరాల్లో తెల్ల కుసుమ సాగు చేస్తున్నట్లు వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు.

రికార్డుస్థాయిలో ధరలు

తెల్ల కుసుమ సాగుకు ప్రభుత్వ పోత్సాహం లభించడంలేదు. సర్దార్‌నగర్, చేవెళ్ల మార్కెట్లో తెల్ల కుసుమ విత్తనాలు లభించడంలేదు. రైతులు తమ వద్ద నిల్వచేసి భద్రపరుచుకొన్న విత్తనాలను మాత్రమే విత్తుకోవాల్సి వస్తోంది. సాగు విస్తీర్ణం తగ్గిపోవడంతో వాటికి రికార్డు స్థాయిలో గణనీయంగా ధరలు పెరిగిపోతున్నాయి. ప్రస్తుతం మార్కెట్లో తెల్ల కుసుమలు క్వింటాలుకు రూ. 8వేలు పలుకుతోంది. తెల్ల కుసుమలను కొని మరాడించి తీసిన నూనె కిలో రూ. 300లుగా ఉంది. గానుగాడించి తీసిన నూనె కొందామన్నా మార్కెట్లో లభించడం లేదు. మిల్లులో, లేదా రైతుల వద్ద కొనుగోలు చేయాల్సి వస్తోంది. వారి వద్ద సైతం డిమాండ్ మేరకు లభించడంలేదు. ఆరోగ్యానికి ఎంతో మేలైన తెల్ల కుసుమ సాగును ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైన ఉంది.

మూడెకరాల్లో వేశాను



ఈ ఏడాది మూడెకరాల్లో తెల్ల కుసుమ పంటతో పాటు నల్ల కుసుమ పంటను సాగుచేశాను. గతంలో వరి పంటను సాగు చేసే వాళ్లం. ప్రభుత్వం వరి పంటకు బదులు ఆరుతడి పంటలు సాగు చేసుకోమనడంతో ఈ పంటను వేశాను. గతంలో ఏడాది పొడవునా తెల్లకుసుమ నూనె వాడేవాళ్లం. మళ్లీ అదే పంటను సాగు చేస్తున్నాం. ప్రస్తుతం మార్కెట్లో తెల్ల కుసుమ నూనెకు మంచి డిమాండ్ ఉంది.

–యాదవరెడ్డి, రైతు, బొబ్బిలిగామ

నూనె గింజల సాగుచేసేందుకు ఆసక్తి



నూనె గింజల సాగుచేసేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. గత 30 ఏళ్ల క్రితం ఎక్కువగా రబీ సీజన్‌లో తెల్ల కుసుమ, నల్ల కుసుమ పంటలను వేసేవారు. ఇప్పుడు పత్తి, మొక్కజొన్న పంటలు సాగు చేయడంతో మార్కెట్‌లో నూనెల ధరలు పెరుగుతున్నాయి. అందుకే నూనె గింజల సాగు చేసేందుకు రైతులు మక్కువ చూపుతున్నారు.

–కూర వెంకటయ్య, రైతు, ముద్దెంగూడ

కొత్తగూడలో ప్రజాపాలన



దరఖాస్తులను స్వీకరిస్తున్న ఎంపీడీఓ, సర్పంచ్

కందుకూరు: మండల పరిధిలోని కొత్తగూడలో శనివారం ప్రజాపాలన గ్రామ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకట్రాములు లబ్ధిదారుల అనుమానాలు నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సాధ మల్లారెడ్డి, ఉప సర్పంచ్ తాళ్ల పద్మమ్మ, వార్డు సభ్యులు హన్మంత్‌రెడ్డి, బి.సునీత, అజీజ్‌ఖాన్, శేఖర్‌రెడ్డి, మహేందర్, వెంకట్‌చారి, సరిత, మమత, బి.సువర్ణ, కోఆప్షన్ సభ్యుడు బాల్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి శివశంకర్ పాల్గొన్నారు.

'గ్యారంటీ'గా అమలు చేస్తాం

పహాడీషరీఫ్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టనున్న ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేసి తీరుతామని మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం కాంగ్రెస్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే కిచన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. జల్‌పల్లి గ్రామంలో కొనసాగుతున్న దరఖాస్తు కేంద్రాన్ని శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంతోనే పేదల కష్టాలు తీరనున్నాయన్నారు. మహేశ్వరం నియోజకవర్గంలో ఈ పథకాలు పూర్తి స్థాయిలో అమలయ్యేలా చూస్తానన్నారు. షేక్ జహంగీర్, మన్నె రవికుమార్, సాదిక్ మహ్మద్, మహ్మద్ అబ్దుల్ బారీ, అహ్మద్ బామ్, శ్రీనివాస్, నవీన్ గౌడ్, లాల్ సతీష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



జల్‌పల్లిలో దరఖాస్తు ఫారాలను అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్

శాంతిభద్రతలను కాపాడాలి

హస్తినాపురం: శాంతి భద్రతల పరిరక్షణకోసం ప్రతి ఒక్కరూ తమ విధులను సక్రమంగా నిర్వహించాల్సిన అవసరం ఉందని ఎల్‌బీనగర్ డీసీపీ సాయిశ్రీ అన్నారు. రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని వనస్థలిపురం పోలీస్‌స్టేషన్‌ను డీసీపీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వనస్థలిపురం ఏసీపీ భీంరెడ్డితో కలిసి పోలీస్‌స్టేషన్‌లోని అన్ని రికార్డులను పరిశీలించారు. అనంతరం స్టేషన్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ.. పోలీస్ స్టేషన్‌కు వచ్చే వారందరికీ సహకరించిన వారికి కావాల్సిన సహకారాన్ని అందించాలని ఎవరినీ ఇబ్బందులకు గురిచేయొద్దని సూచించారు. వనస్థలిపురం సీఐ జలేందర్‌రెడ్డి,డీఐ వెంకట్, ఎస్సైలు, సిబ్బంది తదితరులున్నారు.

విజేతలకు ట్రోఫీ ప్రదానం



ట్రోఫీతో అభిషేక్ అవెంజర్స్ టీమ్

తుక్కుగూడ: వెస్ట్‌కోస్ట్ అప్టిలింక్స్ కంపెనీ నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో 4టీమ్‌లు పోటీపడగా ఇందులో అభిషేక్ అవెంజర్స్ టీమ్ విజేతలయ్యారు. నితేష్‌నైట్ రైడర్స్ రన్నరప్‌గా నిలిచారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన వెస్ట్‌కోస్ట్ అప్టిలింక్స్ ప్రాజెక్టు హెడ్ సత్యేంద్రచౌదరి విజేతగా నిలిచిన జట్టుకు ట్రోఫీ అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం మేము జరుపుతున్న ఈ క్రీడల్లో సిబ్బంది పాల్గొనడం అభినందనీయమన్నారు. ఇలాంటి క్రీడలతో ప్రతీ ఒక్కరికి మానసికోల్లాసం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వెస్ట్‌కోస్ట్ అప్టిలింక్స్ ప్రాజెక్టు టీమ్ సభ్యులు అరుణ్‌కుమార్ సింగ్, అభిషేక్ కుమార్‌సింగ్, పాల్గొని గెలిచిన క్రీడాకారులను అభినందించారు.

నందివనపర్తిలో ఫుడ్ ఫెస్టివల్

యాచారం: మండల పరిధిలోని నందివనపర్తి ఉన్నత పాఠశాలలో శనివారం ఫుడ్ ఫెస్టివెల్ ఘనంగా నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు వివిధ రకాల వంటకాలను తయారు చేసుకుని స్టాల్స్ ఏర్పాటు చేశారు. కేఎఫ్సీ చికెన్, హైదరాబాద్ బిర్యాని, డబల్‌కా మీఠా, జొన్నరొట్టె, చికెన్ ఫ్రై, పులిహోర, మంచూరియా తదితర ఆహార పదార్థాలను స్టాల్స్‌లో ఉంచారు. ఈ సందర్భంగా పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం కిషన్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడానికే ఫుడ్ ఫెస్టివల్ లాంటి కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఉపాధ్యాయులు పద్మశ్రీ, శ్రీలత, అరుణ, విజయరాణి, మల్లీశ్వరి, సుధారాణి, భోజయ్య పాల్గొన్నారు.

సీతక్కను కలిసిన సుంకిరెడ్డి

ఆమనగల్లు: రాష్ట్ర పంచాయితీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖామంత్రి సీతక్కను శనివారం రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ జిల్లా కాంగ్రెస్‌పార్టీ ఉపాధ్యక్షుడు సుంకిరెడ్డి వరప్రసాద్‌రెడ్డి కలిశారు. హైదరాబాద్‌లోని మంత్రి నివాసంలో సీతక్కను వారు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని సీతక్కను రాఘవేందర్‌రెడ్డి అభ్యర్థించారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

సీఐ వెంకటేశ్వర్లు

ఆమనగల్లు: నూతన సంవత్సర వేడుకల్లో నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని ఆమనగల్లు సీఐ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. ఆమనగల్లు పట్టణంలో సీఐ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ఆమనగల్లు, తలకొండపల్లి మండలాల్లో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మద్యం సేవించి వాహనలు నడపరాదని సూచించారు.

రాజీమార్గమే రాజమార్గం



లోక్ అదాలత్‌లో మాట్లాడుతున్న జడ్జి స్వరూప

ఆమనగల్లు: రాజీమార్గమే రాజమార్గమని, ఒక కేసులో రాజీ పడడం వలన ఇరువర్గాలు గెలిచినట్లేనని ఆమనగల్లు కోర్టు జూనియర్ సివిల్ జడ్జి కాటం స్వరూప అన్నారు. ఆమనగల్లు పట్టణంలోని కోర్టు ప్రాంగణంలో శనివారం లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వరూప మాట్లాడుతూ రాజీమార్గం ద్వారా పరిష్కారమయ్యే కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో లోక్ అదాలత్ సభ్యులు ఆంజనేయులుయాదవ్, రామకృష్ణ, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ కార్తీక్, ఆమనగల్లు సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ బాల్‌రాం, ఎక్సైజ్ సీఐ బద్యానాథ్ చౌహాన్, సీనియర్ న్యాయవాదులు లక్ష్మణశర్మ, శేఖర్, మల్లేశ్, గణేశ్, సంతోశ్, ఆంజనేయులు, దేవేందర్ పాల్గొన్నారు.

శివధర్‌రెడ్డిని ఆదర్శంగా తీసుకోవాలి



మాట్లాడుతున్న వెంకటరమణారెడ్డి

జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ వెంకటరమణారెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: గ్రామీణ ప్రాంత విద్యార్థులు మట్టిలో మాణిక్యాలని, వారి నైపుణ్యానికి సానపెడితే మరింత ప్రకాశిస్తారని జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం కార్తికేయ జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాల వార్షికోత్సవాన్ని వైష్ణవి ఫంక్షన్ హాల్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన వెంకటరమణారెడ్డి మాట్లాడారు. అరకొర అవకాశాలతోనే గ్రామీణ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారని కొనియాడారు. అవకాశాలు పెరిగితే అద్భుతాలు సృష్టిస్తారని చెప్పారు. విలువలు, క్రమశిక్షణతో విద్యను అభ్యసిస్తే జీవితంలో అత్యున్నత స్థాయికి చేరుకుంటారని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతం నుంచి ఇంటలిజెన్స్ చీఫ్‌గా ఎదిగిన ఐపీఎస్ అధికారి శివధర్‌రెడ్డిని ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. అత్యుత్తమ ఫలితాలు సాధిస్తున్న కార్తికేయ కళాశాల యాజమాన్యాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్స్‌పాల్ చంద్రకాంత్, పాండు, సిబ్బంది భానుగౌడ్, వెంకటేశంగౌడ్, రాజేందర్, నాగరాజు పాల్గొన్నారు.

ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్‌లో అపార అవకాశాలు

ప్రొఫెసర్ డాక్టర్ శ్యామ్‌సుందర్

ఇబ్రహీంపట్నం రూరల్: ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ రంగంలో అపారమైన అవకాశాలు ఉన్నాయని, ప్రయోగాత్మక విద్యను అభ్యసిస్తేనే సాధ్యమని ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ శ్యామ్ సుందర్ పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలోని గురునానక్ ఇంజనీరింగ్ కళాశాలలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్‌లో అధునాతన ఎలక్ట్రానిక్ సిస్టమ్ డిజైన్ ఐడియేషన్, ప్రోటోటైపింగ్‌పై జాతీయ స్థాయి ప్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం నిర్వహించారు. దేశం నలుమూలల నుంచి వివిధ పరిశ్రమలు, విద్యాసంస్థలకు చెందిన 600 మంది ప్రతినిధులు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన ప్రొఫెసర్ శ్యామ్‌సుందర్ మాట్లాడుతూ ప్రయోగాత్మక విద్యకే మొగ్గు చూపాలన్నారు. అడ్వాన్స్‌డ్ ఎలక్ట్రానిక్ సిస్టమ్ డిజైన్, ఐడియేషన్ ప్రోటో టైపింగ్, ప్రోటోటైప్ ఐడియేషన్, డిజైన్ టెక్నిక్స్‌లను అలవాటు చేసుకొవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు డాక్టర్ వెంకటరావు, జాయింట్ డైరెక్టర్ డాక్టర్ పి. పార్థసారథి, ప్రిన్స్‌పాల్ డాక్టర్ ఎస్‌వీ రంగనాయకులు, శ్రీనాథరెడ్డి, విద్యా సంస్థల వైస్ చైర్మన్ జీఎస్ కోహ్లీ పాల్గొన్నారు.



జాతీయ సదస్సుకు హాజరైన ప్రతినిధులు

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం: కాలనీలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. మార్నింగ్‌వాక్‌లో భాగంగా శనివారం వనస్థలిపురం డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో ఆయన పాదయాత్ర నిర్వహించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ.. తమ కాలనీల నుంచి సాగర్ హైవే రోడ్డు వరకు రెండు ప్రధాన రోడ్లు ఉన్నాయని, ప్రస్తుతం అధ్వాన్నంగా తయారైనందున రోడ్లు నిర్మించాలని కోరారు. కాలనీల ఆవరణలో ఉన్న పార్కు అన్యాక్రాంతం కాకుండా ఉండటానికి దానికి ప్రహరీ నిర్మించాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. కాలనీల్లో నూతన రోడ్లను నిర్మిస్తామని, పార్కు చుట్టూ ప్రహరీని ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్‌రెడ్డి, నాయకులు చింతల రవికుమార్, కాలనీవాసులు యాదవ్‌రెడ్డి, నవీన్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

అధికారులు అందుబాటులో ఉండాలి

- ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి
- ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

తుర్కయంజాల్: అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సూచించారు. రాగన్నగూడలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మున్సిపల్ చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధ అధ్యక్షతన ఏర్పాటు చేసిన తుర్కయంజాల్ మున్సిపాలిటీ పాలకవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరిగతిన పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. రూ.10 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. అనంతరం రూ.60లక్షలతో కొనుగోలు చేసిన స్వీపింగ్ మిషన్‌ను రంగారెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ గుండ్లపల్లి హరిత, కమిషనర్ సీ.హెచ్ శ్రీకాంత్‌తో పాటు పలు శాఖల అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మల్‌రెడ్డి రంగారెడ్డి

అయోధ్య అక్షింతల ఊరేగింపు

ఆమనగల్లు: అయోధ్యలో జరిగే శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఆమనగల్లు మాజీ ఉప సర్పంచ్ కండె కళావతి, లయన్స్‌క్లబ్ ఉపాధ్యక్షుడు పాపిశెట్టి రాము కోరారు. ఆమనగల్లు పట్టణంలోని భక్తమార్కండేయ ఆలయంలో శనివారం అయోధ్య నుంచి తెచ్చిన శ్రీరాముని అక్షింతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్త మార్కండేయస్వామి ఆలయం నుంచి అక్షింతలను ఊరేగింపుగా స్థానిక హనుమాన్ ఆలయానికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అయోధ్యలో రామాలయం నిర్మాణం హిందువుల ఆత్మగౌరవానికి ప్రతీక అని వివరించారు. అయోధ్య నుంచి తీసుకువచ్చిన అక్షింతలను ఆమనగల్లు పట్టణంలోని ప్రతి ఇంటికి పంపిణీ చేస్తామని తెలిపారు. జనవరి 22న శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా ప్రతి ఇంట్లో పండుగ చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు కండెసాయి, సుందూరి శేఖర్, శ్రీశైలంయాదవ్, మహేశ్, రంగారావు, ఆనంద్, సత్యం, కృష్ణయాదవ్, రమేశ్, శ్రీను, మహేశ్ పాల్గొన్నారు.

ఆధునిక యంత్రాలతో రైతులకు మేలు

కొత్తూరు: వ్యవసాయంలో ఆధునిక యంత్రాలు ఉపయోగిస్తే రైతులకు అనవసర ఖర్చులు తగ్గి లాభాలు సాధించొచ్చని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాయలం శాస్త్రవేత్తలు అన్నారు. మల్లాపూర్ గ్రామంలో శనివారం రైతులకు పంటల వ్యర్థాలను తొలగించే యంత్రాలపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ పంటల తర్వాత ప్రతి రైతు వ్యర్థాలను శుభ్రం చేయడానికి కూలీలపై ఆధారపడాల్సి వస్తుందన్నారు. ప్రస్తుతం అందుబాటులతోకి వచ్చిన యంత్రాలతో వ్యర్థాలను చిన్న ముక్కలుగా చేయడంతో పాటు భూమిలోకి కప్పే విధంగా చేయొచ్చని తెలిపారు. ఈ విధానం వలన భూమి మరింత సారవంతంగా మారుతుందన్నారు. గతంలో రైతులు పంటల తర్వాత వ్యర్థాలను కాల్చడంతో విపరీతమైన కాలుష్యం వెలువడేదని పేర్కొన్నారు. ఈ విధానానికి స్వస్తి పలికి యంత్రీకరణను వినియోగించుకోవాలని వారు రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సాయిలు, శాస్త్రవేత్తలు రమేశ్, శైలజ, రాజయ్య, రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.